# వాగ్దానం



ఆకాశములో మేఘాలు దట్టంగా అలముకున్నాయి. ఉరుములు ఉరుముతున్నాయి. చిన్నజల్లు ప్రారంభమయింది. చల్లటిరొజ్జగాలికి కిటికీరెక్కలు టప టప కొట్టుకుంటున్నాయి. కళ్ళకు జిగేలు మనిపించే మెరపుతీగలు ఒక్కసారి మెరసి మాయమవుతున్నాయి. చిట్టిమనస్సులోని ఆలోచనా తరంగాలు కూడ యిదేవిధంగా సాగుతున్నాయి. తన భావిజీవితం ఏవిధముగా వుంటుందో ఆలోచించుకుంటుంది. ఆమెకి బాహ్యప్రపంచస్మారకమేమీ లేదు. తాననుకున్న ఆశలు నెరవేరి తనునిర్మించుకున్న గాలిమేడలు నిలబడతాయా? ఆనాడు తన కాబోయే జీవిత భాగస్వామి అన్నమాటలు నెరవేరుతాయా? అతడు గాని తిరస్కరిస్తే తన జీవితమేమికావాలి? తాను ఏ నుయ్యో గొయ్యో చూచుకోవలసి వస్తుందా? రెండేళ్ళబట్టీ లేని యీ దీపావళి ఆనందం ఇక తన జీవితాంతం ఇదే విధముగా నిలచిపోతుందా? తన తల్లి అన్నమాటలే నిజమౌతాయా? తన బ్రతుకు అంధకార బంధురమయి పోవలసినదేనా? ఈవిధముగా ఆలోచిస్తూంటే చిట్టిదుఃఖం కట్టలుతెగి పొర్లుకొచ్చింది.

'ఏమమ్మా చిట్టి కిటికీతలుపులు కూడ వేసుకోవటంమాని యీ చలిగాలిలో యీ విధముగా భోజనముమాని కూర్చుంటే మరి నీ ఆరోగ్యమేంకాను? లే అమ్మా భోజనం చేద్దువుగాని'అన్నది తల్లి కాంతమ్మ అపుడే వస్తూ.

'నాకు ఆకలిగా లేదమ్మా! నేను భోజనముచేయను' అన్నది చిట్టి.

'లే అమ్మా! మా అమ్మవుకదూ! ఈవిధముగా విచారంగా కూర్చుంటే ఏం ప్రయోజనము చెప్పు. నేను మొదటే చెప్పానే. నామాట విన్నావుకాదు. మగవాడు మహరాజమ్మా. అతడేమి తలచుకుంటే అది జరిగితీరుతుంది. అతడెంతటి దారుణంకైనా ఒడిగడతాడు. ఇహ ఎటొచ్చి చెడేది స్త్రీయే. ముల్లువచ్చి అరటిఆకుమీదపడిన అరటిఆకువెళ్ళి ముల్లుమీదపడినా అరటాకుకే నష్టం. అటువంటిదే నమ్మా స్త్రీ జీవితంకూడ. ఇంతకీ అతడొచ్చి నిన్ను వివాహంచేసుకుంటాడనే నీ నమ్మకమా? రష్యా వెళ్ళాడుగా! వచ్చేటప్పుడు రష్యా స్త్రీని ఒకర్తిని వెంటబెట్టుకుని రాకూడదు. పిచ్చితల్లి! తెల్లనివన్నీపాలు నల్లనివన్నీ నీళ్ళని నమ్మే వెర్రిబాగులదానివమ్మానువ్వు

★★★★★★★★★★★★★★★★★★★★★

రచన :

“కరుణాకర్”

★★★★★★★★★★★★★★★★★★★★★

కాని మగవాడుమాత్రం అటువంటివాడు కాదనిమాత్రం తెలుసుకో' అన్నది తల్లి సూర్యకాంతమ్మ.

'అమ్మా! నువ్వేమైనా అను బావమాత్రం అటువంటివాడు కాదమ్మా! బావ మనసు నాకు తెలుసు. అన్నమాట తప్పడు' అన్నది చిట్టి.

'సరేలే అమ్మా! నీకెంత తోచితే అంతే. ఈకాలము పిల్లలే అంత. దానిమాటకేంలే భోజనము చేద్దువు గాని.

'నువ్వు వెళ్లిపోమ్మా! నాకేమి భోజనము వద్దు' అన్నది చిట్టి విసుగ్గా.

'సరే నీ యిష్టం' సూర్యకాంతమ్మ వెళ్ళిపోయింది.

చిట్టి తిరిగి ఆలోచనా తరంగిణిలో మునిగిపోయింది. ఆకసంలోని మేఘాలు కొద్దికొద్దిగా విచ్చుకుంటున్నాయి. చిట్టి మనసులోని ఆలోచనలుకూడ ఆవిధంగా విచ్చుకోసాగాయి. తన గతాన్ని ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకుంటూ కన్నీరుకార్చసాగింది.

* * *

నాన్న, రామంబావ నాన్నగారు ఒకే ఆఫీసులో పనిచేస్తు ఒకేవీధిలో ప్రక్కప్రక్క యిండ్లలో వుండేవారు. ఇద్దరు స్నేహితులే అయినప్పటికి అన్నదమ్ముల్లా వుండేవారు ఒక్కశాఖలో భేదంతప్ప ఆ వీధిలో వారందరు అన్నదమ్ములే అనుకునేవారు. తనకు జ్ఞప్తివున్నంతవరకు, తాను రామంబావతో ఐదవ తరగతివరకే చదువుకుంది. తరువాత బావ తన పినతండ్రివద్ద చదువుకునేందుకు రాజమండ్రి వెళ్లిపోయాడు. స్కూలుకి సెలవులిచ్చి వేయటంతోనే వచ్చేసేవాడు. వచ్చేటప్పుడు తనకే దో ఒకటి తీసుకువచ్చేవాడు. తనకు జిలాబి అంటే ఎంతో యిష్టం వాటినే బావ తీసుకు వచ్చేవాడు. తనంటే ఎంత ప్రేమని. బావ ఎపుడూ తనదగ్గరే వుండాలని తాను కోరుకునేది. అవిధముగా ఎస్. ఎస్. ఎల్. సి. వరకు నడచింది. పినతండ్రికి ట్రాన్సఫరు అవటంవల్ల తరువాత యీ వూరే వచ్చేసాడు బావ. ఇక్కడ కాలేజీలోనే ఇంటరులోచేరాడు. తానపుడు ఫోర్తుఫారం చదువుతూండేది. ప్రతిదినం తాను, బావ కలసి స్కూలుకుపోయేవారు. బావ వీధి చివరకువచ్చి తనకై రిక్షా కట్టించి తాను నడచిపోయేవాడు. బావ ఇంటరు ఫస్టుక్లాసులో ప్యాసయ్యాడు. ఇంజనీరింగు చదివే ఆర్థికస్తోమతులేక బి. యస్. సి. లో చేరాడు. ఇంటరుపరీక్ష ప్యాసయినపుడు టీపార్టీ సెపంతో తన కోసం ఎన్నికొని తెచ్చాడు. ముఖ్యంగా తన కిష్టమయిన

జిలాబి తీసుకువచ్చాడు. బావకి మల్లి పూలు, సంపంగిపూలు అంటే ఎంత యిష్ట మని. అదినం సంపంగిపూలు తీసుకొచ్చి తనకిస్తూ 'చిట్టీ నీ చక్కటి నల్లనిజుత్తును వాలుజడగా వేసుకుని యీ పూలు నీవు పెట్టుకున్నావంటే నీ వొక అప్సరసలా వుంటావంటాను. మరి నివేమంటావు? అని బావ అన్నపుడు తాను సిగ్గుతో కుంచిం చుకుపోయి ఫో! బావా!' అంటూ తాను బావ ఒడిలో ఒరిగిపోయింది.

* * *

బి. యస్. సి. కూడ ప్యాసయి ఎమ్. ఎస్. సి. చదవటానికి విశాఖపట్టణం వెళ్ళే టపుడు తనతో చెప్పటానికి వచ్చినపుడు తాను చిన్నపిల్లలా మారాము చేస్తుంటే భావ తనని ఎంతలా వూరడించాడు. 'ఛీ! అదేమిటి చిట్టీ! చిన్నపిల్లవిధముగా! నేనే మైనా దేశం విడిచి వెళ్ళిపోతున్నానా అంతలా చింతించటానికి. నిన్ను మాత్రం విడిచి నే వెళ్లగలనా చెప్పు. నే వెళ్ళినా నా మనస్సంతా నిల్చేది నీమీదే. నీ వలా కన్నీటిముఖంతోవుంటే నే ఎలా వెళ్లగలను చెప్పు. శుభ్రంగా టాయ్‌లెట్ అయి యీ సంపంగిపూలు తలలో తురుముకొని చిరు నవ్వుముఖంతో వీడ్కోలు యివ్వు' అని తననావిధంగా తయారుచేయించి తనని చూస్తూ ఎంత మురిసిపోయాడు బావ. తను బావ కిష్టమయిన నీలిరంగు వూనా చీర కట్టుకొని, సంపంగిపూలతో వీధిలో నిల బడివుంటే వీధిమలుపు తిరిగేవరకు తన వైపుచూస్తూ చేయివూపుతూంటే ఎదురింటి అనసూయ, ప్రక్కింటి సావిత్రి ఎంత అసూయపడ్డారని. వారు బావతో పరి చయము యేర్పరచుకోవటానికి ప్రయ త్నించేవారు. కాని బావ ఎవుడూ తప్పుకు తిరిగేవాడు. అటువంటిబావ తన నివుడు ద్రోహంచేస్తాడా ?

* * *

బావ యమ్. ఎస్. సి. ఫైనలు ఇయర్ చదువుతూన్నవుడే తన తండ్రి మరణిం చటం జరిగింది. ఆ విషయం తెలిసి బావ ఎంత బాధగా ఉత్తరం వ్రాసాడు. తాను ఎమ్. ఎస్. సి. లో రిసెర్చిచేయ యూని వర్సిటీ రష్యాలో రిసెర్చిచేయటానికి అక్క డికి పంప నిశ్చయించుకుంది. రష్యా పోయేముందు బావ ఒకసారి వచ్చాడు. ఆ రాత్రి తనతోను, అమ్మతోను ఎంతహృదయ విదారకంగామాట్లాడాడు. 'అత్తా మామయ్య పోయారు మీకే కష్టాలువచ్చాయి. ఎంతటి వానికైనా కష్టాలు తప్పవుగా. నీకు ఆర్థి



కంగా అవసరమొస్తే నాకు తప్పక ఉత్త రము వ్రాయి. నేను తప్పక పంపుతాను. ఇక నా మనస్సులోవున్నది నీకు చెవు తున్నాను. చిట్టిని నేను తప్పక వివాహము చేసుకుంటాను. నీవేమీ బెంగపెట్టుకోకు. చనువుచేతనే అన్నానని అనుకోకు. నన్ను నమ్ము. నేను తప్పక చేసుకుంటాను' అన్నాడు. అపుడు అమ్మేమంది. 'నాయనా! మీరు మగవారు, మీ రన్నది చెల్లుతుంది. చిట్టి అడది—దానిని మోసగించకు' అని అన్నవుడు దైవసాక్షి అని కూడ ఒట్టువేసు కున్నాడు. రైలుకి పోయేముందు తనతో రహస్యంగా 'చిట్టీ నీవేమీ బెంగపెట్టు కోకు. నిన్ను తప్పక వివాహము చేసు కుంటాను. అత్తను జాగ్రతగా చూసుకో డబ్బు అవసరమైతే తప్పక ఉత్తరం వ్రాయి. ఇక్కడ జరిగే సంగతులన్నీ వ్రాయి. ఇక నీవిషయము నా హృదయ ములో నీకుతప్ప మరెవ్వరికీ స్థానంలేదని తెలుసుకో' అని అంతవిధంగా తనకు, అమ్మకు చేసిన వాగ్దానాన్ని బావ నిలబెట్టు కుంటాడా ? లేక అమ్మ అన్నట్లు తన జీవి తాన్ని నాశనంచేస్తాడా ? — ఛీ! తన మన స్సేమిటి ఇ విధంగా చెడుత్రోవన పోతు న్నది. మొన్న మొన్నటివరకు తనకు ఉత్త

రాలు వ్రాస్తూనేవున్నాడే. ప్రతి ఉత్తరంలో అత్త ఆరోగ్యం జాగ్రత! నీకు నా ముద్దులు' అని యింగ్లీషులో వ్రాస్తుంటాడు. అటువంటి బావని అమ్మ యిప్పుడెంతో చులకనగా అంటున్నది. ఏమో తన నొసటి వ్రాత ఏవిధంగావుంటే ఆవిధంగా జరగక మానదు. అంతా దైవాధీనం' — ఈ ఆలోచనలతో చిట్టికి ఎపుడు నిద్రపట్టిందో తెలియదు. చిన్న మబ్బుతునకలతోవున్న ఆకాశముమాదిరిగా ఆ అమాయకజీవి హృదయముకూడ ఆలోచనలతో ఆవేదనతో కూడివుంది

*   *   *

బాలభానుని అరుణరాగకిరణాలు నులివెచ్చగానుండి గిలిగింతలు పెడ్తున్నాయి. గది కిటికీగుండా వానికిరణాలు గదిలోకి ప్రవేశించాయి. చిట్టి బద్ధకంగా అటునుండి యిటు తిరిగి ఒక్కసారి కళ్ళు విప్పింది. తన కళ్ళను తానే నమ్మలేకపోయింది. ఎదురుగ నిండైన విగ్రహం, వంకీలుతిరిగిన తుమ్మెదలలాటి నల్లటి జుత్తు, పనామాఫేంటు నీలిరంగు షార్క్‌స్కిన్ లాల్చీటకప్‌చేసిన ఫేంటులో రెండు చేతులుంచి చిట్టివైపుచూస్తూ చిరునవ్వు నవ్వాడు అవ్యక్తి. ఒక్కసారి ఆమెలో సిగ్గు దొంతరలు వ్యాపించాయి.

'కూర్చో! బావా! ఇపుడేనా రావటం'

'కాదు రాత్రే వచ్చా. కాని రాత్రేవస్తే రాణిగారు నిద్రపోతారని రాలేదు'

'మరి వస్తున్నానని ఉత్తరమైనా వ్రాయలేదేం?'

'ఏం ఉత్తరం వ్రాయాలా?' అంటూ చిట్టికండ్లు చూచాడు. కన్నీటిచారలుకట్టి కొద్దిగా వాచాయి కండ్లు.

'ఆదేమిటి చిట్టి? ఏం అట్లా వున్నాయి కళ్లు?'

'ఏంలేదు బావా?'

ఇంతలో కాంతమ్మ ప్రవేశించింది.

'రాత్రల్లా తిండిమాని విచారిస్తూ కూర్చున్నది నాయనా?'

'ఛీ! అదేమిటచిట్టి! పిచ్చిసిల్లలా?'

'అమ్మా చిట్టి లేచివెళ్లి కాఫీ టిఫిను తయారుచెయ్యి మరి వచ్చాడుగా బావ రెండేళ్లకి. అమాత్రమైనా మర్యాదచేయవా ఎంత బావైతేమాత్రం' అన్నది కాంతమ్మ. రామం చిఱునవ్వు నవ్వాడు. చిట్టి లేచి కురులు సర్దుకుని ఒక్కసారి రామంవైపు కొంటెచూపుచూసి వెళ్ళిపోయింది.

*   *   *

మిలమిలలాడే తారలతో వెన్నెలరేడు వినువీధిలో మేఘాలలో దోబూచులాడుతున్నాడు. ప్రణయజీవులకతడొక ఆరాధ్య దైవం. ఘుమ ఘుమ లాడే మల్లెపందిరి క్రింద మంచం మీద రామం మేను వాల్చాడు. ప్రక్కనే చిట్టి కూర్చుంది.

'చిట్టీ'

'ఊఁ....'

'ఈరాత్రి ఎంతో ఆనందంగా వుంది కదూ?'

'ఊఁ....'

'ఎందుచేతనో చెప్పగలవా?'

'ఏమో!'

'ఈ చల్లనివెన్నెలలో యీ మల్లెపందిరి క్రింద నీవంటి అందమైన కోరిన కన్య చెంతనుంటే యీరాత్రి ఆనందమయంకాక ఏమవుతుంది? చూడు అత్త అన్నదిగా మగవారు మోసగాళ్లని. కాని అది నావిషయంలో ఎక్సంప్షను. చిన్ననాటినుండి నిన్నే కోరాను. నిన్నే వివాహంచేసికోవాలనుకున్నాను. ఆ ఉద్దేశ్యంతోనే నీకు, అత్తకు వాగ్దానంచేసాను. దానిని నిలబెట్టుకునేందుకు ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధపడ్డాను. నీ మంచితనానికి, అమాయకత్వానికి అమ్మ, నాన్న కూడ మురిసిపోయారు. అందుకే యీ వివాహానికి అంగీకరించారు. నేను విదేశాలు వెళ్ళటంవల్ల నేను తిరిగి నిన్ను పరిగ్రహిస్తానో లేదో అని అనుమానపడ్డావు. కాని నీకు ద్రోహంతలపెట్టే ఉద్దేశ్యం నాలో లేదు, ప్రేమికులు తాము వలచినవారు తమకు న్యాయం చేకూర్చాలనే కోరుతారు. ఒకనేళ నాలో యేదైనా చెడుతలంపు కలిగినా నీ అమాయకచూపులు నా ఆలోచనను పారద్రోలేవి. అపుడు నేను నీకు అన్యాయము చేస్తున్నానేమోననే బాధ కలిగేది. నేను పురుషుడిని, నీవు స్త్రీవి, స్త్రీ అబల. ఈ సంఘం ఒక నులివురుగు. ప్రణయజీవుల జీవితాలను నాశనం చేయటానికే ప్రయత్నిస్తుంది. కాని అది కొందరి విషయంలో. నావిషయంలోమాత్రంకాదు. చిట్టీ నీపవిత్రమైన ప్రేమ నాహృదయాన్ని దొలిచివేసింది. నన్ను నీవు ఆకర్షించుకున్నావు. ఇక మనల్ని యీసంఘం ఏమిచేయలేదు. చిట్టీ! మనం స్వేఛ్ఛాజీవులం'.

'బావా! ఇంతఆదర్శవంతమైనమనస్సు, దయార్ద్రమైన హృదయంకల నిన్ను భర్తగా పొందటం నా అదృష్టమే. నీ వాగ్దానాన్ని నిలబెట్టుకున్నావు. అంతేకాదు! నాచిరకాల వాంఛితం నెరవేరింది.' చిట్టి ఆనంద బాష్పాలతో రామం హృదయంమీద వాలిపోయింది. సిగ్గుచేకాబోలు చంద్రుడు మేఘాలచాటుకు పోయాడు.

★

